# సారీ..డాడీ!

— డేగా జయంతి



4-2-'93 ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వెలువడిన వార్త:

"రద్దీగా వున్న బస్‌లలో ప్రయాణించేటప్పుడు కాలేజీ విద్యార్థులకన్నా వయసు మళ్ళిన వారే ఆడపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తారు ఎందుకు?" అని ఓ సెమినార్‌లో ఓ కాలేజీ విద్యార్థిని ప్రముఖ సెక్సాలజిస్ట్ డాక్టర్ నారాయణరెడ్డిని అడిగిన ప్రశ్న చూసి ఈ కథ రాశాను.

—రచయిత్రి

# “మే..మే... మే” మేకపిల్లలా ఒకటే అరుపు.

## “టర్... టర్... టర్” ఆ మేక పిల్లని అదిలిస్తున్న గొర్రెల కాపరి.

## రోడ్డు మీద నడుస్తున్న ఆమె అడుగులు తడబడుతున్నాయి. ఆమెకి అర్థమయింది– మేకపిల్లలా అరుస్తున్నదెవరో; ‘టర్–టర్’మని ఆ మేకల్ని అదిలిస్తున్నదెవరో!



ఆమె– ఇందుమతి– ఆ రోజున తల నిండా పూలు పెట్టుకుని కాలేజీకి బయల్దేరింది. ఆమె జడలోని పూలని అందుకోవడానికి మేక పిల్ల వెంట పడినట్టు, ఆ మేకని అదిలించడానికి గొర్రెల కాపరి ప్రయత్నించినట్టు కాలేజీ బోయ్స్ ఆమెని టీజ్ చేస్తున్నారు. గుండె చిత్రంగా వణకడం ప్రారంభించింది. చేయి కంపిస్తోంది. అప్పటికే ఆమె మొహం మంకెనపువ్వులా ఎర్రబడింది, కోపంతో. విసవిసా నడచి వెళ్ళిపోతోంది, తలంటి పోసుకున్న జుట్టు గాలికి అలల్లా కదుల్తోంది. గంధం రంగు పట్టు పరికిణీ, అదే రంగు జాకెట్, తెల్లటి వోణీలో కదిలిపోతున్న ఆమె వెనుక భాగాన్ని మాత్రమే చూస్తున్నారు ఆ కుర్రకారు. అడుగులకు అనుగుణంగా ఆమె నడుం మీద తాళం వేస్తున్న పొడవాటి జడని గమనించే స్థితిలో లేరు వారు. కానీ వారి చూపులు తన వీపుకి గుచ్చుకోవడం మాత్రం ఆమె గమనించకపోలేదు. పవిటని భుజాల మీదగా తిప్ప[illegible]ని బొడ్డు దగ్గర దోపుకుంది.

బస్‌స్టాప్...

ఆమె ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు ఎలా నడచి వచ్చిందో ఆమెకే తెలియదు. అందాలన్నీ ఒకచోట పోగు చేసినట్టు రకరకాల రంగులలో... దుస్తులలో... అలంకరణలో ఆడపిల్లలు! కళ్ళతోనే వారిని ఒళ్ళంతా తడిమేస్తూ కాలేజీ అబ్బాయిలు.

“32–18–35” అన్నాడు ఓ అబ్బాయి తననే పరీక్షగా చూస్తూ.


డా॥ ఇండ్ల రామసుబ్బారెడ్డి



M.D. (PSYCH.), D.P.M. (NIMHANS), F.I.P.S.
**PSYCHIATRIST**

VISHNUVARDHANARAO STREET, SURYARAOPET,
VIJAYAWADA – 520 002.


“కాదు 34–26–36” అన్నాడు మరో అబ్బాయి, మొదటి అబ్బాయిని కరెక్టు చేస్తూ!

# రద్దీలో రుద్దుకొనే మగవాడు ఓ
# అటువంటి వాడి బారిన పడిన ఓ

"కాదు 32–18–35 బెట్ కడతావా" సవాలు చేశాడు మొదటి అబ్బాయి రెండవ అబ్బాయిని.

అర్థమయింది – వారేం మాట్లాడుకుంటున్నారో!

అవి తన మెజర్‌మెంట్స్–

సిగ్గుతో చితికిపోయింది– పబ్లిక్‌గా, అదీ తన ముందే అబ్బాయిలు కామెంట్ చేస్తున్నందుకు కొంత, అమ్మాయిలు కూడా అందులో భాగం పంచుకుంటున్నందుకు మరి కొంత!

అంతలో బస్ వచ్చింది. 'బ్రతికిపోయాను' అనుకుంటూ హడావిడిగా బస్ ఎక్కింది.

బస్ నిండా జనం– అది ఆఫీసులకి, కాలేజీలకు వెళ్ళే టైమ్ అయినందున. అందులో స్టూడెంట్సే ఎక్కువ. మనిషి కాలు తీసి కాలు పెట్టే ఖాళీ కూడా లేదు. అంత రద్దీగా వుంది. సీట్లలో కూర్చున్నవారు ఒక వంతు; నిల్చున్నవారు రెండు వంతులు. గాలి చొరరానంతగా క్రిక్కిరిసిపోయింది బస్ అంతా. అప్పుడు గమనించిందామె తన ముందు ఒక అబ్బాయి– వెనుక మరొక అబ్బాయి వున్నాడని.

చిన్న జెర్క్‌తో బస్ కదిలింది.

వెనుక నిల్చున్న విద్యార్థి కోతి చేష్టలు ప్రారంభించాడు. మెడ వెనుక అతని ఊపిరి వెచ్చగా సోకుతోంది. ఇది కాదు ఆమెని ఇబ్బంది పెట్టింది– గట్టిగా వెనుక నుంచి తగులుతున్నాడు. ఏది ఏమిటో గ్రహించలేని వయసు కాదామెది. సిగ్గుతో చితికిపోయింది. కాటుక కళ్ళని ఎత్తలేకపోయింది. మనసులోని భావాలను అతికష్టం మీద అణచుకుంటోంది. దానితో వెనుకనున్నవాడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టయింది. ఆమె పవిట చాటుకి తన చేయి చేర్చాడు. ఆ చేయి మెల్లి మెల్లిగా పైకి జరుగుతోంది. గుండెల్ని తాకుతోంది. ఆమె కోపం ఏడుపుగా మారింది. కాని అతడది గమనించే స్థితిలో లేడు. యవ్వనం షార్ట్ సర్క్యూట్ అయి నరాలన్నీ కనెక్షనిచ్చిన విద్యుత్తీగలయ్యాయి. గుండెకు గండిపడ్డట్టయిది. సరిగ్గా అదే సమయంలో ముందున్నవాడు వెనుక నున్న వాడితో మాట్లాడడానికా అన్నట్లు తటాలున వెనుదిరిగాడు.

మగపిల్లలు ఇద్దరూ ఎదురెదురుగా, మధ్యలో ఆమె– చపాతీలు పేర్చినట్టు ఒకర్ని రాసుకుంటూ మరొకరు!

హిస్టీరిక్‌గా మారింది. బస్‌లో అంతమంది మధ్యలో జరుగుతున్నదేమిటి? ఆమెకా క్షణాన తెలియదు– ఎవరి అనుభవం వారిదని!

అప్పుడు జరిగిందీ సంఘటన. అతడు ఎంత సేపట్నుంచీ గమనిస్తున్నాడో... "ఇలా రామ్మా, వచ్చి కూర్చో" అంటూ తన సీటు చూపించాడు. అప్పటికే ఆ సీటులో ఇద్దరు వున్నారు. సీటు చూపించిన వ్యక్తి తన సీటులోనుంచి లేవలేదు. లేవడానికి అవకాశం లేదు కూడా. ఆ సీటులో మూడో వ్యక్తి కూడా కూర్చోడానికి అవకాశం లేదు. అయినా ఆమె అదేమీ ఆలోచించే స్థితిలో లేదు. ఆ ఆకతాయి అబ్బాయిల మధ్య నుంచి తప్పుకోవడమే ధ్యేయంగా ఆ సీటులో అతడి పక్కనే – కూర్చుంది–అనేకంటే దాదాపుగా అతడి ఒడిలో కూర్చుంది అనడం సమంజసంగా వుంటుంది.

సీటు ఆఫర్ చేసిన వ్యక్తి మధ్య వయసులో వున్నాడు. బట్టతల– నెరసిన జుత్తు– ఖద్దరు లాల్చీ అతడికి అదనపు పెద్దరికాన్ని ఆపాదించాయి. ముందు నుంచి ఒకడు, వెనుక నుంచి మరొకడు పెట్టిన హింస నుంచి అప్పుడప్పుడే తేరుకుంటోంది ఆమె. ఒడిదుడుకులతో –సడన్ బ్రేకులతో తన ఒరిజనల్ స్టయిల్‌లో సిటీబస్ సాగిపోతోంది. వయసు మళ్ళిన ఆ వ్యక్తి యథాలాపంగా వేసినట్టు వేశాడు– తన చేతిని ఆమె తొడ మీద. ఆ కుర్రవాళ్ళిద్దరూ కలిగించిన మానసిక క్షోభ నుంచి అప్పుడే తేరుకుంటున్న ఆమె అతడి చేతిని అంతగా పట్టించుకోలేదు. అక్కడ్నించి అతడు తన చేతిని మెల్లగా పైకి జరిపాడు. అతడి వయసు ఆమెని మరోలా ఆలోచించనివ్వలేదు. అతడి చేయి పవిట చాటున గుండెల మీదికి ఎగబాకటంతో ఈ లోకానికొచ్చింది. జరుగుతున్నదేమిటో గ్రహించింది. తటాలున కూర్చున్న చోటు నుంచి లేచింది. తన తండ్రి వయసున్న వ్యక్తి... 'అమ్మా' అని అపురూపంగా పిలిచిన వ్యక్తి చేయదగిన పనేనా అది? రెప్పలచాటున దుఃఖాన్ని దాచుకుంది. కాలేజీ కుర్రవాళ్ళు డెలిబరేట్‌గా చేశారు, ఏం చేసినా. కాని ఈ ముసలి నక్క...? అతడి పట్ల ఏహ్యభావం కలిగింది. తర్వాత యాంత్రికంగా నిలబడిపోయింది. కాలేజీ స్టాపులో దిగింది. క్లాసుకి ఎలా వెళ్ళిందో ఆమెకే అర్థం కాలేదు. అప్పుడు గమనించిందామె– తాను చదువుకుంటున్నది కో–ఎడ్యుకేషన్ కాలేజీ అయినా కొంత మంది ఆడపిల్లలు పక్కనేవున్న హాస్టల్ నుంచి నడచి వస్తారు. తానూ హాస్టల్‌లో చేరితే – అబ్బాయిల వల్గర్ కామెంట్స్, సిటీ బస్‌లో రుద్దుకోవడాలు వుండవు.

–ఆ అభిప్రాయంతోనే ఆ రోజున తండ్రి దగ్గర హాస్టల్ ప్రస్తావన తీసుకొచ్చింది.

ఇందుమతి తండ్రి బ్యాంక్ ఆఫీసర్. కూతురి కోరిక వినగానే ఆయన భృకుటి ముడివడింది. కేవలం జీతం మీదే బ్రతికే ఓ సగటు ఉద్యోగికి తాను వుంటున్న వూళ్ళోనే కూతుర్ని హాస్టల్‌లో పెట్టి చదివించాలంటే తలకు మించిన భారమే. అలాగని పిల్లలపై తన సమస్యల్ని, తన అభిప్రాయాల్ని– అభిరుచుల్ని రుద్దే మనస్తత్వం కాదు.

ఇందుమతి కూడా తన సమస్యని తండ్రికి స్పష్టంగా చెప్పలేదు.

"పోన్లే... ఎన్నడూ అమ్మాయి మనల్ని విడిచి వుండలేదు. ఇలాగయినా కొత్తవారితో కలసి వుండడం, సర్దుకుపోవడం, మనల్ని చూడకుండా వుండగలగడం నేర్చుకుంటుంది"– అని భార్య చెప్పడంతో ఆమె అభిప్రాయంతో ఏకీభవించాడు.

విమెన్స్ హాస్టల్ భవంతి పూలవనంలా వుంది. రంగు రంగుల సీతాకోకచిలుకల్లాంటి అమ్మాయిలు... రకరకాల ఫేషన్స్... అసూ

# మానసిక రోగి: ఆడపిల్ల కథ!

ర్యంపశ్యలు... సగం సూర్యంపశ్యలు– ముగ్ధలు... లైసెన్స్ బిళ్ళలు తగిలించుకున్నవాళ్ళు... ట్రెస్ పాసర్స్... జీన్స్... చీరలు... కుర్తాలు... గౌన్లు... మిడ్డీలు... లిప్‌స్టిక్కులు... నవ్వుల కిక్కులు... పొంగిపొర్లుతున్న యవ్వనాలు... బిగదీసి కడ్తూన్న జారిపోతున్న వయసులు... ప్రౌఢలు... జాణలు... వెరసి అదో అద్భుతలోకం!

"మీ రూం నెంబర్ నైన్... మీతో పాటు మరో అమ్మాయి వుంటుంది. ప్రస్తుతం ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడటానికి వరంగల్ వెళ్ళింది. రేపో, ఎల్లుండో రావచ్చు..." అన్నది హాస్టల్ క్లార్కు గది తాళం ఇస్తూ!

చిన్న గది అది... ఎదురెదురుగా రెండు మంచాలు. కిటికీ రోడ్డు వైపు వుండడంతో వెలుతురు, గాలే కాదు రోడ్డు మీదగా వచ్చిపోయేవారూ కనిపిస్తున్నారు. గది చిన్నగా వున్నా ఇద్దరు హాయిగా వుండొచ్చు.

రెండు మంచాల మధ్యగా ఓ టేబుల్ వుంది. దాని మీద ఫోటో ఫ్రేమ్. ఆ ఫోటో చూడగానే తన రూమ్మేటని గుర్తించింది. ఆమె ఎవరో తనకి తెలుసు; తానెవరో ఆమెకి తెలిసే అవకాశం లేదు!

కొత్తజీవితం ప్రారంభమయింది. మొదటి రాత్రి గడచిపోయింది– ఏ ప్రత్యేకతా లేకుండా! తెలవారుజామునే వినిపించిన బెల్ మోతకి మెలకువ వచ్చింది. పేస్ట్‌ని బ్రష్ మీద వేసుకొని బాత్‌రూం వైపు కదిలింది.

వాష్ బేసిన్ ముందు నిలబడి వుందో ఆకారం. పైన కుర్తా, క్రింద లుంగీ– లుంగీని తొడల పైకి మడచి కట్టుకోవడంతో తొడలు తెల్లగా మెరుస్తున్నాయి. ఒంటి మీద బ్లౌజు లేనట్టుంది– పైపెచ్చు పై బటన్స్ పెట్టనందున గుండెలు కనిపిస్తున్నాయి; అంతకు మించి బ్రష్ చేసుకుంటున్నప్పుడు అవి విచిత్రంగా కదులుతున్నాయి. సరిగ్గా అప్పుడే ఒంటి మీద చీరగాని, నైటీ గాని లేకుండా కేవలం బ్లౌజు, అడుగు లంగాతో స్నానానికి కాబోలు బకెట్‌లో టవలు, సోపు పెట్టకుని వెళ్తోంది మరొకామె. పక్క బాత్‌రూం నుంచి ఎవరిదో పాట వినిపిస్తోంది. "లే లే, నా రాజా..." అని!

అదొక విచిత్ర వాతావరణం.. అక్కడ దాపరికాలు లేవు; మోడెస్టీ అంతకన్నా లేదు. విచ్చలవిడితనం రాజ్యమేలుతోంది.

బ్రష్ చేసుకొని బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడానికి బయల్దేరింది. అప్పటికే హాస్టల్‌లోని అమ్మాయిలలో ముప్పాతిక భాగం మెస్‌కి వెళ్ళారు.

తన క్లాసుమేట్ ఒకామె అదే హాస్టల్‌లో వుంది. ఆమె మెస్‌కి వెళ్ళిందోలేదో... లేకుంటే కలిసి వెళ్దామని ఆ రూముకి వెళ్ళింది. తలుపు దగ్గరగా వేసి వుంది. తలుపు కొడదామని టచ్ చేయగానే తలుపు తెరుచుకుంది. లోపల కనిపించిన దృశ్యాన్ని చూసిన ఇందుమతి మ్రాన్పడిపోయింది. ఏ దృశ్యం కంటపడగూడదో అదే దృశ్యాన్ని చూసిందామె. ఆడా మగలా ఆ ఇద్దరు ఆడపిల్లలూ...

పొరపాటున లోపల తలుపు గడియ పెట్టుకోనందున జరిగిన పరిణామమిది!

చివాలున వెనుదిరిగింది. ఆ తర్వాత డైలీ కార్యక్రమం రొటీన్‌గా జరిగింది.

ఆ రోజున ఆఖరి క్లాసు తెలుగు– ఓల్డ్ పొయెట్రీ. శ్రీనాథుని చాటువులు చెబుతున్నారు. తెలుగు మాష్టారు సంస్కృత పండితులే కాదు, మహానటులు కూడా! "సత్యహరిశ్చంద్ర"లో విశ్వామిత్రుడుగా నటించి రంగస్థల అభిమానుల్ని ఆకట్టుకున్న మహానుభావుడు. ఆయన కాలేజీలో ఒక వింగ్‌లో వుండి పాఠం చెబుతుంటే రెండో వింగ్‌లోని వారికి వినిపిస్తుంది. అటువంటి కంచు కంఠం ఆయనిది.

## శ్రీనాథుని చాటువు

తొలకరి మించు తీవగతి దోప దుకాణము మీద నున్న అ
య్యలికులవేణితో తమలపాకుల బేరము లాడబోయి నే
వలచుటకేమి? శంకరుని వంటి మహాత్ముదు లింగ రూపియై
కులికెదు దాని గబ్బి చనుగుబ్బల సందున నాట్యమాడగన్"


**10% డిస్కౌంట్**



కైనెటిక్ ఎయిర్ కూలర్

కైనెటిక్ ఎయిర్ కూలర్లు, వాషింగ్ మెషీన్లు, కిచెన్ మెషీన్ల కొనుగోలుపై 10 శాతం తగ్గింపు పొందండి !

పాఠకుని పేరు :..............................

పూర్తి చిరునామా :..............................

..............................

మీ దగ్గరలోని కైనెటిక్ డీలర్‌కి ఈ కూపన్ అందజేయండి



కైనెటిక్ వాషింగ్ మెషీన్

ప్రత్యేక సూచన : ఈ కూపన్ వినియోగించుకున్న ప్రతి 25 మందిలో ఒకరికి లక్కీడిప్ ద్వారా కైనెటిక్ కంపెనీ నుండి సర్‌ప్రైజ్ గిఫ్ట్ అందజేయబడుతుంది. కనుక మీ పూర్తి చిరునామా మరువవద్దు.

బహుమతులు అందజేస్తున్నవారు


**YOU JUST CAN'T DIGEST UNLESS YOU MIX 'N' GRIND**



**KINETIC**

**KITCHEN MACHINE**



**Highlights**

★ 450 Watts ★ Motor-ISI Standards
★ Blades and Jars of top grade Stainless Steel
★ Double Locking System ★ Overload Protection
★ 3 Jars for different operations

**Marketed by**
KINETIC MARKETING ASSOCIATES
7-148/2, Nagendra Nagar, Habsiguda,
Hyderabad-500 007. Phone: 852997

PRASAD & RK


శ్రీనాథుడు ఒకసారి తమలపాకులు కొనుక్కోటానికి అంగడికెళ్ళాడు. ఆ అంగడి మీద వున్న యువతి చాలా అందగత్తె. ఆమెను శ్రీనాథుడు మోహించాడు. పక్కనున్న వారెవరో "మహా కవీ! మీకిది తగునా?" అని ప్రశ్నించారు. అప్పుడు ఆ కవిసార్వభౌముడు సమాధానంగా చెప్పిన పద్యం ఇది.

"మెరుపు తీగలాగా మెరుస్తూ దుకాణంలో కూర్చుని తమలపాకుల మ్ముతున్న ఆ సుందరిని నేను ప్రేమించటం తప్పూ కాదు, విశేషమూ కాదు. శంకరుని లాంటి మహాత్ముడే ఆమెను ప్రేమించి, లింగరూపం ధరించి ఆమె స్తనాల మధ్య నాట్యం చేస్తున్నాడు గదా"'

'జంగములు మెడలో శివలింగాన్ని ధరిస్తారు. ఆ సంప్రదాయాన్ని బట్టి ఆమె కూడా మెడలో శివలింగాన్ని ధరించింది. ఆమె గుండెల మధ్య ఉండి, ఆమె కులుకుతున్నపుడు అటూ ఇటూ కదులుతున్నదది. కదలుతున్న శివలింగాన్ని చూచి శ్రీనాథుడు పైవిధంగా చమత్కరించాడు.

* * *

కాటుకలా చీకటి. లైటు వేయడమే మర్చిపోయి అలాగే గదిలో కూర్చుంది ఇందుమతి. ఆలోచనలు స్తంభించిపోయాయి.

సిటీబస్‌లో స్టూడెంట్స్ గొడవ, బట్టతలబాబు నిర్వాకం; క్లాసులో శ్రీనాథుని చాటువులు—

ఓ నిర్ణయానికి వచ్చింది— రూము ఖాళీ చేసి ఇంటికి తిరిగి వెళ్ళాలని. లేచి లైటు వేసింది. అప్పుడు గమనించింది— రోడ్డు మీద ఓ వారగా చెట్టు నీడన జీపు వచ్చి ఆగింది. అందులో నుంచి ఓ యువతి దిగింది. ఆమె భుజాన ఓ ట్రావెలింగ్ బ్యాగ్. డ్రైవింగ్ సీట్లోని వ్యక్తి కూడా దిగాడు.

ఆమెను తన రెండు చేతుల్లోకీ తీసుకున్నాడు. ఇద్దరి ముఖాలు దగ్గరయ్యాయి. అతడి చేతులు ఆమె వంటి మీద పాకుతున్నాయి. కొద్దిసేపటికి విడిపోయారు. ఆమె హాస్టల్‌వైపు నడిచింది. అతడు జీపు వైపు!

ఇందుమతి అతడ్ని గుర్తించింది. అతడు ఫిజికల్ డైరెక్టర్ రాయ్. !!

ఆమె నిర్ణయం దృఢపడింది. లేచి చకచకా తన సామాన్లు సర్దుకోసాగింది.

కొద్దిసేపటికి వరండాలో అడుగుల సవ్వడి మొదలయింది. ఆ చప్పుడు తన గది గుమ్మం దగ్గర ఆగిపోవడంతో తల త్రిప్పి చూసింది.

ఆమె— అంతకు కొద్ది నిముషాల క్రితం జీపు దిగింది— తన రూమ్మేట్— ఫుట్‌బాల్ ఆడటానికి వరంగల్ వెళ్ళి తిరిగి వచ్చింది.

"హాయ్... నా పేరు రమ. నీవేనన్నమాట నా రూమ్మేటువి" అంతకుమునుపు ఏమీ జరగనట్టు నవ్వుతూ చేయి చాచింది.

అనాలోచితంగా చేయి కలిపిన ఇందుమతి దృష్టి ఆమెపై నిలిచింది.

బ్రాసియర్ లేని మస్లిన్ బ్లౌజులోంచి తొణికే స్తనాలు— కళ్ళలో పొడుస్తున్నట్లుగా! బ్లౌజులోంచి స్తనాల రంగు, కండ, సాంద్రత, వుబ్బు, వొంపు, మృదుత్వం; పచ్చగా మెరుస్తూ నిలకడగా నిలిచిన పొట్ట, వంకరగా చుట్టుకున్న గులాబీ రేకుల్లా పెదవులు!

"సారీ... ఈ హాస్టల్‌లో, ఈ రూములో ఎక్కువ కాలం వుండలేకపోతున్నందుకు" అంటూ తన లగేజితో బయటకు నడిచింది ఇందుమతి.

"పూర్ గర్ల్..." అంటూ దీర్ఘంగా నిట్టూర్చింది, వెళ్ళిపోతున్న ఇందుమతిని చూసి!

* * *

48 గంటలయినా కాకమునుపే హాస్టల్ నుంచి వెనుదిరిగి వచ్చిన కూతురి వైపు ప్రశ్నార్థకంగా చూశాడాయన!

"సారీ డాడీ..." ఇందుమతి సమాధానం.

నాటి నుంచి హాస్టల్ జీవితమంటేనే కాదు, కాలేజీకి వెళ్ళాలన్నా, సిటీబస్ ఎక్కాలన్నా ఇందుమతికి భయం! చదువు మానేసి ఇంట్లో కూర్చున్న ఆమె ఇప్పుడు తలిదండ్రులకి ఓ సమస్య అయింది.

◆

* *సిటీబస్‌లో కాలేజీ విద్యార్థినిని విద్యార్థులు టీజ్ చేయడాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. కాని తండ్రి వయసున్న వ్యక్తి ఆ విద్యార్థినిని అలా చేయడం... సిటీబస్‌లలో సాధారణంగా జరుగుతున్న ఇటువంటి అనుభవాల తెరవెనుక ఏమున్నది?*

* *గురువు దైవంతో సమానం అంటారు. కాని ఫిజికల్ డైరెక్టరు తన స్టూడెంట్‌తో అలా ప్రవర్తించవచ్చా? శ్రీమతి జయంతి రాసిన ఈ కథలో ఇందుమతి తీసుకున్న నిర్ణయం సరైనదేనా?*

## ఈ ప్రశ్నలకు ఫేమస్ సైకియాట్రిస్ట్ ఇండ్ల రామ సుబ్బారెడ్డిగారి వివరణ:

* సిటీబస్‌లలో ఆడవాళ్ళని రాసుకుంటూ రుద్దుకుంటూ మగవాళ్ళు నిలబడటమన్నది ఆంధ్రాలోకన్నా తమిళనాడులో - ప్రత్యేకించి మద్రాసు సిటీలో ఎక్కువ. విజయవాడలో స్త్రీలకు బస్ ముందునుంచి, పురుషులకి బస్ వెనుకనుంచి ఎక్కి దిగే ఏర్పాటు చేశారు-ఈ ప్రమాదాన్ని అరికట్టడానికే! తమిళులు వారి సంప్రదాయప్రకారం లుంగీలు కట్టుకుంటారని ఈ సందర్భంగా ప్రత్యేకంగా గుర్తుచేస్తున్నాను.

* వయసు మళ్ళినవారు చిన్న (ఆడ) పిల్లల్ని తడమడమన్నది మానసిక రోగం. దీనిని ఫ్రాట్యూరిజమ్ (FROTTEURISM) అంటారు. ఇది ఒకరకమైన సెక్సువల్ పెర్వర్షన్. జనం తోసుకుంటూ వుండే బస్‌లలో/రైళ్ళలో/దేవాలయాలలో/క్యూలలో/మీటింగులలో ఈ మానసిక రోగులు తన అంగాన్ని అపరిచితులకేసి రుద్దడంవలన మాత్రమే భావోద్రేకం పొందుతారు. ఇది వారి బలహీనత. ఇలా చేస్తేనే వారికి అంగం గట్టిపడుతుంది. భావోద్రేకం కలుగుతుంది. ఒకరకంగా చెప్పాలంటే ఈ పద్ధతికి వారు బానిసలు!

దీనికి ముందు నేను ఒక విషయం చెప్పదలిచాను.

* కొంతమంది నలుగుర్నీ పోగేసి లెక్చర్లు దంచుతుంటారు. వారెవరు? పనీపాటా లేనివారు. పని వత్తిడి వున్నవారు ఎవరైనా అలా ఊసుపోక కబుర్లతో కాలక్షేపం చేయడం మీరు చూశారా? అలాగే, జీవితంలో సెక్స్‌పరమైన కోరికలు తీరక-పెర్వర్షన్‌తో కొందరు ఇలా మిస్‌బిహేవ్ చేస్తుంటారు.

ఈ సమస్యకి రెండు రకాల ట్రీట్‌మెంట్స్‌ని సూచిస్తాను. ఒకటి - 'యాంటీ ఆండ్రోజన్'. రెండు లాంగ్‌టర్మ్ సెక్స్ కౌన్సిలింగ్ థెరపీ.

### ముక్తాయింపు:

ఈ కథకు సోషల్-మెడికల్ వేల్యూస్ వున్నాయి.

పురుషాంగాన్ని పరస్త్రీలకు తాకించడమన్నది మానసిక రోగం-ఫ్రాట్యూరిజమ్ (FROTTEURISM). ఇటువంటివారివలన సంఘానికి విపరీతమైన హాని జరుగుతున్నప్పుడు యాంటీ ఆండ్రోజన్ థెరపీ చాలా అవసరం. (ట్రీట్‌మెంటుని పత్రికాముఖంగా నేను వివరించడంలేదు. ఈ అలవాటు వున్నవారు తమ సమీపంలోని క్వాలిఫైడ్ సైకియాట్రిస్టుని సంప్రదించడం మేలు). అలక్ష్యం చేస్తే ఫలితాలు దుర్భరంగా, దారుణంగా వుండవచ్చు.

రెండు-కాలేజీ విద్యార్థులు టీజ్‌చేయడం, సిటీబస్‌లో వయసుమీద పడిన వ్యక్తి మిస్‌బిహేవ్ చేయడం చూసి 'ఇందుమతి' హాస్టల్‌లో చేరింది. సమస్యకి పరిష్కారం - పారిపోవడం కాదు. ఇక్కడ వున్న సమస్యలే వేరొకచోటా, వేరొక రూపంలో వుంటాయి. ఆ అమ్మాయి వాళ్ళ అమ్మగారితో/నాన్నగారితో చెప్పాలి. అటువంటి అవకాశాన్ని పెద్దలు ఇవ్వాలి. పిల్లలు తమ సమస్యల్ని తమ తలిదండ్రులతో గాక ఎవరితో చెప్పుకుంటారు?

ఈ కథలో ఇందుమతి - కాలేజీ స్టూడెంట్స్ "మే.. మే.." అని టీజ్ చేస్తున్నప్పుడు ఉడుక్కున్నట్టు చెప్పారు. స్టూడెంట్ లైఫ్‌లో అది సాధారణ విషయం. అటువంటి విషయాల్ని చాలా కాజువల్‌గా తీసుకొనేలా పిల్లల్ని మానసికంగా తయారు చేయవలసిన బాధ్యత పెద్దలది.

పిల్లలు కొంతమంది పరీక్ష ఫెయిలయితే ఆత్మహత్య చేసుకున్నట్టు మనం వింటుంటాం. పరీక్ష పాసవడం లక్ష్యమే కావాలి గాని జీవిత ధ్యేయం కాగూడదు. కొన్ని సందర్భాలలో మనం అనుకున్నవి అనుకున్నట్టుగా జరగవు. ఆ పరిస్థితిని పిల్లలు భరించలేరు. ప్రత్యేకించి - మెడికల్ సీటు సంపాదించడానికి అహర్నిశలు శ్రమించి, సీటు రాక మెంటల్ డిప్రెషన్‌కి గురయినవారు నాకు తెలుసు. కొంత మందికి పరీక్షలంటే మహాభయం. అటువంటి వారు కూడా మూడు నాలుగు నెలల ముందే తమ సమీపంలోని సైకియాట్రిస్టుని సంప్రదిస్తే మంచిది.

మీ పిల్లలకి సెన్సాఫ్ హ్యూమర్, స్పోర్టివ్ స్పిరిట్ అలవాటు చేయడం తల్లిదండ్రులుగా మీ బాధ్యత.

ఇక ఇందుమతి హాస్టల్లో చూసిన లెస్బియన్స్ గురించి: లెస్బియనిజమ్ విపరీత లైంగిక ధోరణి/సమర్ధనీయం వగైరా వివాదాన్ని పక్కన పెడితే దాదాపు 18 ఏళ్ళ కథా నాయికకు లైంగిక కార్యం, పునరుత్పత్తి వగైరా అంశాలు బొత్తిగా తెలియనందు వల్లే అంతగా షాక్ అయిందని అర్థమౌతూంది. ప్రపంచంలో పలు సమస్యలు, పలు బాధలు అనేది ఆమెకు స్ఫురించలేదు. అసలు సెక్స్ అంటే ఏమిటో తెలియవలసిన పరిమితులలోనైనా ఆమెకు తెలిసి వుంటే కథలో అమ్మాయిలజంటని చూసి అంతగా మనసు చెదిరి వుండేది కాదు. అది ఒక విపరీతధోరణిగా గుర్తించేది, అనవసర ప్రాముఖ్యాన్ని ఇచ్చి మథనపడేది కాదు.

**Life is a Challenge - Face it**
**Life is a Game - Enjoy it**